విలేకరులు కావలెను

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143

TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA

ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 212 | శనివారం 10.10. 2026 | ఎడిటర్ः జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00



కాన్షీరాంకు భారతరత్న ఇవ్వాలి

టీఆర్ఎస్ చీఫ్ కవిత

హైదరాబాద్ తెలంగాణ వాణి)
అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం కావాలన్న అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో చూపిన మహనీయుడు కాన్షీరాం అని..ఆయనకు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆయన వర్ధంతి సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాన్షీరాం స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తామని చెప్పారు. అణగారిన వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే ఆ మహనీయునికి మనమిచ్చే ఘనమైన నివాళి అని చెప్పారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా అణగారిన వర్గాలను అసెంబ్లీకి తీసుకెళ్లి తీరుతామన్నారు. తెలంగాణ రక్షణ సేన సామాజిక న్యాయ సంకల్పానికి కాన్షీరామే స్ఫూర్తి అని చెప్పారు. తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలంతా ఈ సామాజిక న్యాయ సంకల్పానికి కట్టుబడి, బహుజన సాధికారత కోసం నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు.ప్రతి ఇంటికి పాంచజన్యం తీసుకెళ్లండి

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వివిధ రహదారుల అనుసంధానత, రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై సమీక్ష
- రద్దీ ఉన్న ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు
- మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్టీ ఉండేలా డిజైన్ చేయాలి
- ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్టీలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలి
- సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమైన కాలనీల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు పెద్దపీట వేయాలి
- రహదారుల్లో సజావుగా రాకపోకలు సాగించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి గారు నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముంది.




తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు

హైదరాబాద్ తెలంగాణ వాణి)
తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. నివాస అపార్ట్‌మెంట్ల ఎత్తు పరిమితిని 18 నుంచి 24 మీటర్లకు పెంచింది. 24 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాలకు ఫైర్ టవర్ తప్పనిసరి చేసింది. బేస్‌మెంట్‌లో డీజీ రూముల వెంటిలేషన్‌కు కొత్త వెసులుబాటు కల్పించింది. క్రెడాయ్, నరెడ్కో, బిల్డర్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 అక్టోబర్ 7 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఫైర్ ఎన్‌వోసీ సరళీకరణ, భవనాల్లో అగ్ని భద్రతా చర్యల అమలే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రకృతితో మమేకమైన జీవనానికి ప్రతీక

విదేశాల్లోనూ పరిఢవిల్లుతున్న సంస్కృతి

స్పీకర్ ప్రసాద్ కుమార్




స్విట్జర్లాండ్, అక్టోబర్ 8: విదేశాల్లో స్థిరపడినా మాతృభాషను, మన సంస్కృతి, సాంప్రదాయాలను మరువకుండా కాపాడుతుండడం అందరూ హర్షించదగ్గ విషయమని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చిన్న పిల్లలకు తెలుగు భాష నేర్పిస్తూ, బతుకమ్మ, బోనాలు వంటి ఉత్సవాలను నిర్వహిస్తూ భాషా సంస్కృతిని స్విట్జర్లాండ్ లో ఇనుమడింపజేయడం భావితరాలకు ఆదర్శమన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా మిగతా 2లో..

అన్నే కార్సన్‌కు సాహిత్యంలో నోబెల్

కెనడా రచయిత్రికి విశిష్ట పురస్కారం

సరికొత్త సాహిత్య ప్రక్రియలను సృష్టించినందుకు ఈ గౌరవం

సంప్రదాయ శైలికి ఆధునికతను జోడించడంలో ఆమెది ప్రత్యేక పంథా



హైదరాబాద్ తెలంగాణ వాణి) ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే నోబెల్ పురస్కారాల ప్రకటన కొనసాగుతోంది. తాజాగా 2026 సంవత్సరానికి గాను సాహిత్యంలో నోబెల్ బహుమతిని కెనడాకు చెందిన ప్రముఖ రచయిత్రి. కవయిత్రి అన్నే కార్సన్‌కు అందజేస్తున్నట్టు స్వీడిష్ అకాడమీ ప్రకటించింది. సాహిత్యంలో ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అరుదైన గౌరవం దక్కింది. సంప్రదాయ సాహిత్యంతో సరదాగా సంభాషిస్తూనే, సమకాలీన సాహిత్యం కోసం సరికొత్త రూపాలను సృష్టించిన ఆమె సాహసోపేతమైన, సృజనాత్మక మిగతా 2లో..

మనూర్‌లో విషాదం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

ఒకరిని కాపాడబోయి మరో ఇద్దరు నీట మునక

మనూర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
సంగారెడ్డి జిల్లా మనూర్ మండలంలో విషాదం చోటుచేసుకుంది. బట్టలు ఉతికేందుకు చెరువుకుంటకు వెళ్లిన సంగమేశ్వర రెడ్డి (42), నరసింహారెడ్డి (45), కృష్ణవేణి (38) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. సంగమేశ్వర రెడ్డి నీటిలో పడిపోవడంతో కాపాడేందుకు ప్రయత్నించిన నరసింహారెడ్డి కూడా మునిగిపోయాడు. కృష్ణవేణిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాపై స్టింగ్ ఆపరేషన్ !

డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు

తన వద్ద ఫొటోలు, పత్రాలు

స్టింగ్ వెనుక ఉన్నోళ్లు తెలుసు

అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



హైదరాబాద్ తెలంగాణ వాణి) కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మిగతా 2లో..

చిన్న బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించిన కమిషనర్

మహిళలకు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచన



జమ్మికుంట, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
జమ్మికుంట పట్టణంలోని శివాలయం గ్రౌండ్‌లో నిర్వహించనున్న చిన్న బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ గురువారం పర్యవేక్షించారు. వేడుకలకు హాజరయ్యే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొలుగూరి కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, రామారాజ్, సిబ్బంది గజ్జెల కాంతి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం : తెలంగాణ గవర్నర్

హైదరాబాద్ తెలంగాణ వాణి)
సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యానికి ఈ చట్టం పునాది అని పేర్కొన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజలు దాఖలు చేసే ఆర్టీఐ దరఖాస్తులను కేవలం కాగితాలుగా చూడకూడదని, వాటి వెనుక ఒక సమస్య, హక్కు లేదా న్యాయం కోసం చేసే విజ్ఞప్తి ఉంటుందని గవర్నర్ పేర్కొన్నారు. దరఖాస్తులు, అప్పీళ్ల పరిష్కార గణాంకాలే చట్టం విజయానికి కొలమానం కాదని, పరిపాలనా విధానాల్లో శాశ్వతమైన పారదర్శక మార్పు రావాలని ఆకాంక్షించారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించడానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తెలంగాణ వంటి వైవిధ్యభరితమైన రాష్ట్రంలో తెలుగు సహా స్థానిక భాషల్లో సమాచారం అందుబాటులో ఉంచాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ (ఏఐ), డేటా విశ్లేషణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ వంటి ఆధునిక సాంకేతికతలను సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉండేలా వినియోగించడం ద్వారా సమాచార వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.





నిప్పుల కొలిమి

మండుతున్న ఎండలు

37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..!

హైదరాబాద్ తెలంగాణ వాణి) రాష్ట్రంలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతున్నది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండల మంటలు, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా,. భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావంవల్లే వాతావరణంలో ఈ మార్పులు మిగతా 2లో..



దిల్లీలో అలర్ట్.. ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ సహా సర్ ప్రక్రియను రద్దు చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ శనివారం ఆందోళనలకు పిలుపునివ్వడంతో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. రవాణా సదుపాయాలతో పాటు పౌరుల రాకపోకలపైనా నియంత్రణ చర్యలు చేపట్టారు. నగరంలో 45 మెట్రో స్టేషన్లు మూసివేయడంతోపాటు న్యూదిల్లీ, నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే పలు రైళ్లనూ అధికారులు రద్దు చేశారు. వీటితోపాటు సెంట్రల్ దిల్లీలో ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. జంతర్ మంతర్‌కు నాలుగు కిలోమీటర్ల పరిధిలో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి శనివారం రాత్రి 10 వరకు ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు అమల్లో ఉండనున్నట్లు దిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇందుకు కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నాయి. ఈ నిర్దేశిత ప్రాంతాలు మినహా దిల్లీ అంతటా మొబైల్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపాయి. శనివారం ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ జిల్లాను 20 జోన్లుగా విభజించి.. ఆందోళనల కట్టడి ప్రణాళికను అమలు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

గ్రీన్ బ్యాడ్జీలు ధరించి పర్యావరణ హిత బతుకమ్మ వేడుకలు

- ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి.. ప్రకృతిని కాపాడాలి
- పాషిగామ పాఠశాలలో వినూత్న కార్యక్రమం



వెల్గటూర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
పర్యావరణ పరిరక్షణే భవిష్యత్తు తరాలకు మనం అందించే తరగని ఆస్తి అని పాషిగామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాషిగామ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా పర్యావరణ హిత బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రీన్ బ్యాడ్జీలు ధరించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉంటూ, ప్రకృతిలో సహజంగా లభించే పూలతో బతుకమ్మలను తయారు చేసుకోవాలని సందేశమిచ్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రకృతి పరిరక్షణతో ముడిపెట్టి నిర్వహించడం కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్నతనం నుంచే విద్యార్థుల్లో ప్రకృతిపై ప్రేమ, పర్యావరణ స్పృహ పెంపొందిస్తే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఉపాధ్యాయులు వివరించారు. పండుగలు ప్రకృతికి హాని కలిగించేవిగా కాకుండా, ప్రకృతిని కాపాడేవిగా ఉండాలనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ తెలిపారు. సహజ వనరులను సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి మంచి అలవాట్లను చిన్ననాటి నుంచే అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాంద్రపు శిరీష, ఉపాధ్యాయులు మహేష్, ప్రణీత, కావేరి, సహాయక బృందం సభ్యులు రామక్క, ప్రవళిక, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్త జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, సీఏ ప్రమీల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి తీవ్ర గాయాలు.. బాధితుడిని కాపాడిన 108 సిబ్బంది

సకాలంలో స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు





పెద్దపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి కిందపడి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం స్ట్రెచర్‌పై అంబులెన్స్‌లోకి తరలించి, మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అత్యవసర సమయంలో సకాలంలో స్పందించి బాధితుడికి వైద్య సహాయం అందించిన 108 సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సహాయక చర్యల్లో 108 ఈఎంటీ కుమారస్వామి, పైలట్ పనగంటి శ్రీనివాస్, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

మల్లాపూర్ గురుకులంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

ధర్మారం, అక్టోబర్ 09 (తెలంగాణ వాణి)



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో ప్రిన్సిపల్ కే అరుణ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి సంయుక్తంగా బతకమ్మ ఆడుతూ సాంప్రదాయ పాటలతో కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో.. సీనియర్ వైస్ ప్రిన్సిపల్ హేమ, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ సబిత, పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సుంచు మల్లేశం, వాడకాపురం రవి, మెట్పల్లి నరేష్, కాంపల్లి తిరుపతి, డప్పుల నరసన్న, ధోని పాళ్ళ అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో ఎండాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

రైతు ఐడీ నమోదులో పాలకుర్తి మండలం జిల్లాలో ప్రథమ స్థానం



పెద్దపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):
వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ సూచించారు. శుక్రవారం ఈసాలతక్కలపల్లి గ్రామంలోని వరి పొలాలను పరిశీలించి, తెగులు లక్షణాలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించి, పొటాష్ ఎరువులను వినియోగించాలని, తెగులు సోకిన పొలాల నుంచి ఇతర పొలాలకు నీరు పారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన మందులను వ్యవసాయ అధికారుల సలహా మేరకు పిచికారీ చేయాలని తెలిపారు. రైతు ఐడీ నమోదులో 87.27 శాతం ప్రగతి ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్రిస్టాక్--వన్ నేషన్ వన్ ఫార్మర్ ఐడీ కార్యక్రమంలో ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ప్రమోద్ కుమార్ కోరారు. రైతు ఐడీ నమోదులో 87.27 శాతం ప్రగతితో పాలకుర్తి మండలం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి రైతు ఐడీ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుల గౌరవం, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- వృద్ధుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
వృద్ధుల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు వృద్ధులకు తగిన ఆదరణ, ప్రేమాభిమానాలు అందించాలని సూచించారు. మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, ఒంటరితనం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపరమైన సమస్యలను గుర్తించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు, సామాజిక భద్రతా పథకాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రుబినా బేగం మాట్లాడుతూ.. వృద్ధుల హక్కుల పరిరక్షణ, గౌరవప్రదమైన జీవనానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వివక్ష చూపకుండా కుటుంబంలో వారికి తగిన స్థానం కల్పించాలని పేర్కొన్నారు. వారి అనుభవాలు యువతకు మార్గదర్శకమని, సేవలను గుర్తించి గౌరవించడం సమాజ నైతిక బాధ్యతని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. వృద్ధుల హక్కులను కాపాడుతూ, వారికి గౌరవప్రదమైన, ఆరోగ్యకరమైన, భద్రతతో కూడిన జీవనాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. అనంతరం వృద్ధుల హక్కులు, చట్టాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమాజానికి వివిధ సేవలు అందించిన వృద్ధులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. వృద్ధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా వైద్యాధికారి గణేశ్వర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, వివిధ శాఖల అధికారులు, వృద్ధులు పాల్గొన్నారు.

గీత కార్మికుల హక్కుల సాధనకు సమరశంఖం

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



పెద్దపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):
ఈ నెల 14న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్న తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవాలు, రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్గాం ప్రెస్‌క్లబ్‌లో సింగం సత్తయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, 50 ఏళ్లు నిండిన 37,381 మంది కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్‌ను రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచడంతో పాటు రక్షణ కవచాలు, ద్విచక్ర వాహనాలు అందించాలని కోరారు. ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించి, నీరా ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కుక్కలగూడూరులో బెల్ట్‌షాపు తొలగించాలి
పాలకుర్తి మండలం కుక్కలగూడూరులో కల్లు మండువాలో ఏర్పాటు చేసిన అక్రమ బెల్ట్‌షాపును తొలగించాలని స్థానిక గీత కార్మికులు డిమాండ్ చేశారు. దీనివల్ల సుమారు 150 గీత కార్మిక కుటుంబాల ఉపాధికి నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సింగం సత్తయ్య గౌడ్, గౌని సాంబయ్య, కోల రామ్మూర్తి గౌడ్, పొన్నం అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లంకొండ వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించారు.

ప్రభుత్వ భూమి, నాలా, శ్మశానవాటిక ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

- గోపన్‌పల్లి సర్వే నంబర్ 21పై విచారణ జరపాలి
- శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఫిర్యాదు



శేరిలింగంపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి విలేకరి):
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి సర్వే నంబర్ 21లో ప్రభుత్వ భూమి, శ్మశానవాటిక స్థలం, సహజ నాలా ఆక్రమణలపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శేరిలింగంపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సదరు ప్రభుత్వ భూమిలో ఆకృతి కన్స్ట్రక్షన్ నిర్మాణ సంస్థ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు, చెరువులు, సహజ నాలాలు, శ్మశానవాటికలను పరిరక్షించడం అధికారుల బాధ్యతని అన్నారు. గ్రామ ప్రజలకు అత్యవసరమైన శ్మశానవాటిక స్థలం ఆక్రమణలకు గురైతే అంత్యక్రియల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్మశానవాటిక హద్దులను గుర్తించి, రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాలా ఆక్రమణలతో వరద ముప్పు సహజ నాలాల ప్రవాహ మార్గాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే భారీ వర్షాల సమయంలో వరద నీరు నిలిచిపోయి పరిసర ప్రాంతాలు, కాలనీలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. చెరువులకు నీరు చేరే మార్గాలు దెబ్బతినడంతో పాటు పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని కోరారు. సర్వే నంబర్ 21లోని ప్రభుత్వ భూమి హద్దులు, శ్మశానవాటిక విస్తీర్ణం, నాలా అసలు మార్గాన్ని అధికారిక రికార్డుల ఆధారంగా నిర్ధారించి, ఆక్రమణలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


రసాయన శాస్త్రంలో ముదిరెడ్డి రామిరెడ్డికి పీహెచ్.డీ.



పటాన్ చెరు, అక్టోబర్ 9, (తెలంగాణ వాణి)
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి రామిరెడ్డి ముదిరెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'కొత్త ఆల్ఫా గ్లూకోసిడేస్ నిరోధకాలుగా బెంజిసోక్సాజోల్, సిన్నమోహైడ్రాజైడ్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, జీవసంబంధ మూల్యాంకనం'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ రామిరెడ్డి డాక్టరేట్ పరిశోధన, సంభావ్య మధుమేహ నిరోధక ఏజెంట్లుగా కొత్త బెంజిసోక్సజోల్-ట్రైజోల్, సిన్నమోహైడ్రజైడ్ ఉత్పన్నాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్లు తెలియజేశారు. సంశ్లేషణ చేసిన సమ్మేళనాలు ఆశాజనకమైన ఆల్ఫా-గ్లూకోసిడేస్ నిరోధక క్రియాశీలతను ప్రదర్శించాయని, వీటిలో అనేక అభ్యర్థులు ప్రామాణిక ఔషధమైన అకార్బోస్ కంటే గణనీయంగా బలమైన క్రియాశీలతను కనబరిచాయన్నారు. మాలిక్యులర్ డాకింగ్, ఇన్-సిలికో ాణవీజు/శీఱ అధ్యయనాలు వాటి అనుకూలమైన బంధన పరస్పర చర్యలు, ఫార్మకోకైనటిక్ లక్షణాలు, ఔషధ వంటి లక్షణాలను మరింత బలపరిచినట్లు తెలిపారు.డాక్టర్ రామిరెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్లు తెలిపారు.

జెడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ
- మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శెట్కార్



నారాయణఖేడ్: అక్టోబర్ 09 (తెలంగాణ వాణి ప్రతినిధి)
తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని నారాయణ ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శెట్కార్ అన్నారు. శుక్రవారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాయణఖేడ్లో ఘనంగా నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ పువ్వులనే పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు . ఆటపాటలతో పాటు తెలంగాణ మహిళల చారిత్రిక పోరాటాలకు కేంద్రంగా నిలిచిందన్నారు . రాబోవు తరాలకు మన పండుగలను సాంప్రదాయాలను తెలియజెప్పడానికి పాఠశాలలో ఇలా నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి, షెట్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివాని షేట్కార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి ఉపాధ్యాయులు బసమ్మ ,సునంద అశోక్ గౌడ్ రాజశేఖర్, చంద్రశేఖర్, రాజయ్య దన్సింగ్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

హజ్రత్ షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (గౌస్ -ఏ-ఆజమ్) గ్రంధోత్సవం.

ప్రత్యేక పూజ లో పాల్గొన్న బీ ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్.



డిండి (గుండ్లపల్లి) అక్టోబర్ 09(తెలంగాణ వాణి ప్రతినిధి)
డిండి పట్టణం కేంద్రంలో కొలువైన హజ్రత్ షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (గౌస్ -ఏ-ఆజమ్)గంధోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమంను బీ ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తనవంతు సహాయంగా 25,000 రూపాయలు కమిటీ సభ్యులకు అందించడం జరిగింది.అనంతరం కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా మహాసన్నదాన కార్యక్రమం ప్రారంభించడం జరిగింది .ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు అందుకున్న నల్గొండ జిల్లా కలెక్టర్



నల్గొండ అక్టోబర్ 9(తెలంగాణ వాణి ప్రతినిధి)
సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1) బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనిపించినందుకు గాను నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు.ఈ మేరకు గురువారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ నుండి ఉత్తర్వులు అందాయి . అక్టోబర్ 9న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఈ అవార్డును స్వీకరించనున్నారు. జిల్లా కలెక్టర్ కు సమాచార హక్కు చట్టం అమలు లో ఉత్తమ కలెక్టర్ గా రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సమాచార హక్కు చట్టం అసోసియేషన్లు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



పెద్దపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పల్లె మాధవి విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతి ఆరాధనతో పాటు మహిళల ఐక్యతను చాటిచెబుతుందని ఆమె అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకుని భావితరాలకు అందించాలని సూచించారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

మత సామరస్యానికి ప్రతీక హజ్రత్ షేక్ అబ్దుల్ ఖదీర్ జిలానీ

మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



డిండి(గుండ్ల పల్లి) అక్టోబర్ 09(తెలంగాణ వాణి ప్రతినిధి)
డిండి మండల కేంద్రంలో నిర్వహించిన హజ్రత్ షేక్ అబ్దుల్ ఖదీర్ జిలానీ గంధోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మత సామరస్యం, సోదరభావం, శాంతి, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అన్ని మతాల వారు పరస్పర గౌరవం, స్నేహభావంతో కలిసి మెలిసి జీవించాలని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

నాగారంలో సెల్ టవర్ చిచ్చు: బస్‌స్టాప్ వద్ద స్థానికుల బైఠాయింపు!

- పాఠశాల పక్కనే టవరా?..
  రేడియేషన్ భయంతో తల్లిదండ్రుల ఆందోళన
- డిసికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపాటు



నాగారం అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపార ప్రయోజనాలే ముఖ్యమయ్యాయా? నియమావళిని తోసిరాజని పాఠశాలల పక్కనే సెల్ టవర్లు ఏర్పాటు చేస్తారా?.. అంటూ నాగారం వాసులు ఆగ్రహంతో రగిలిపోయారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా నాగారం డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌కు వ్యతిరేకంగా స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం నాగారం బస్‌స్టాప్ వద్ద రోడ్డుపై బైఠాయించి హోరెత్తించారు. బస్‌స్టాప్ పక్కనే నిత్యం వందలాది మంది పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాల ఉందనే కనీస జ్ఞానం లేకుండా సెల్ టవర్ ఎలా ఏర్పాటు చేస్తారని బాధితులు ప్రశ్నించారు. టవర్ నుంచి వెలువడే ప్రమాదకర రేడియేషన్ వల్ల విద్యార్థులతో పాటు, చుట్టుపక్కల నివసించే ప్రజల ఆరోగ్య తీవ్రంగా దెబ్బతింటుందని వాపోయారు. ఈ అక్రమ నిర్మాణంపై ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా విన్నపాలను బుట్టదాఖలు చేస్తారా అని మండిపడ్డారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తక్షణమే జోక్యం చేసుకుని, టవర్ నిర్మాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేసి, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలి

- గంజాయి, గుడుంబా, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



బజార్హత్నూర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

మండలంలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ పనితీరు, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణను సమీక్షించారు. గంజాయి, గుడుంబా, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పశువుల అక్రమ తరలింపును అడ్డుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ పోలీసు--ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ జి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో త్వరలో 10 సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు

కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

జిల్లాలో రైతులకు సోయాబీన్ విక్రయాల్లో ఇబ్బందులు కలగకుండా త్వరలో 10 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదిలాబాద్, జైనథ్, బేల, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ (హస్నాపూర్), ఇంద్రవెల్లి, నార్నూర్, నేరడిగొండ ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి సదుపాయాలు కల్పించాలని, పంట తూకంలో పారదర్శకత పాటించి, నగదును రైతుల ఖాతాల్లో త్వరగా జమ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, మార్క్‌ఫెడ్ డి.ఎం. మహేష్ కుమార్, కేంద్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ రవికుమార్, ఏవో టెక్నికల్ విశ్వామిత్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ టౌన్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ప్రాక్టికల్ శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం వైద్య కళాశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల భద్రతపై చర్చించారు. నిర్దిష్ట సమయంలో పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూర్చాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, డిసిహెచ్ఓ కాశీనాథ్, ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- దసరా, బతుకమ్మ పండుగలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల



నిర్మల్ టౌన్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో పెండింగ్ కేసుల పరిష్కారం, సీసీటీఎన్ఎస్ నవీకరణ, ఈ-సాక్ష్య, జీరో ఎఫ్ఐఆర్ విధానాల అమలుపై సమీక్షించారు. గంజాయి అక్రమ రవాణా, సైబర్ మోసాలు, ఆస్తి నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టి, మహిళలు, బాలల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు వాహనాలను తనిఖీ చేసి, వాటిని ఎల్లప్పుడూ విధులకు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్,నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి, సమ్మయ్య, సత్యనారాయణ, ప్రవీణ్, సాయి కుమార్, రవీందర్ నాయక్, దీపక్, మల్లేష్, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



కట్టకింది తండా పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

ఎల్లారెడ్డి మండలం కట్టకింది తండా (హజీపూర్) పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో సందడి చేశారు. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మౌనిక, ఉపాధ్యాయురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

రూ.1.70 లక్షల నగదు, బాలెనో కారు స్వాధీనం





వలిగొండ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ, రామన్నపేట, భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఐదు డీజిల్ చోరీ కేసులకు సంబంధించి సయ్యద్ సోహైల్ అలియాస్ పప్పు సోహైల్ (24)ను వలిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహన తనిఖీల సమయంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి రూ. 1.70 లక్షల నగదు, బాలెనో కారు, మొబైల్ ఫోన్, ఇనుప రాడ్, ప్లాస్టిక్ పైపు, 16 క్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పర్యవేక్షణలో, డీఎస్పీ పి. మధుసూధన్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

చెత్త బుట్టలు, మొక్కల పంపిణీ





చౌటుప్పల్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులకు చెత్త బుట్టలు, మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రెవెన్యూ, అటవీ భూముల హద్దుల గుర్తింపునకు రీ సర్వే

- ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ టౌన్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

జిల్లాలో రెవెన్యూ, అటవీ భూముల సమస్యల పరిష్కారానికి రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రీ సర్వే పురోగతి, ప్రభుత్వ భూముల హద్దుల గుర్తింపు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై సమీక్షించారు. రోజువారీ లక్ష్యాలతో నిర్దిష్ట గడువులో రీ సర్వే పూర్తి చేయాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, జిల్లా అటవీ శాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో దేవిదాస్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూలనే దైవంగా ఆరాధించే పండుగ బతుకమ్మ

చందన పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు





చౌటుప్పల్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

చౌటుప్పల్‌లోని చందన పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతి పట్ల ప్రేమను, మహిళల ఐక్యతను చాటుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి



చౌటుప్పల్, అక్టోబర్ 9(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)

చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగడపల్లి లో శుక్రవారం ఐదో వార్డులో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఊదరి యాదయ్య పాల్గొన్ని స్మార్ట్ రేషన్ కార్డులను వార్డ్ ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, పి ఎ సి ఎస్ సభ్యులు రావుల స్వామి నాయకులు పందుల రాజేష్ గౌడ్,బొడ్డు ముత్యం గౌడ్,ఎండి అస్లాం ఖాన్, బొల్లోమోని శ్రీకాంత్, రేషన్ డీలర్ అరుణ, వార్డ్ మహిళలు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి రూ.75 వేల ఎల్ఓసీ సాయం



నాగారం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):

నాగారం 5వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన బానోత్ అనితకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చొరవతో రూ.75 వేల ఎల్ఓసీ సాయం మంజూరైంది. మంజూరైన చెక్కును మాజీ కౌన్సిలర్లు లావణ్య శ్రీనివాస్, అనంత్ రెడ్డి, బీఆర్ఎస్ నేత నిమ్మల శ్రీనివాస్ బాధితురాలికి అందజేశారు. ఆపద సమయంలో ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యేకు అనిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌నగర్ కాలనీ అధ్యక్షుడు సడల భిక్షపతి, మాజీ అధ్యక్షుడు సడల అశోక్ మరియు కాలనీ ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు

జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావాలి చంద్రయ్యతో కాంగ్రెస్ నాయకుల భేటీ



నాగారం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావాలి చంద్రయ్యను నాగారం 5వ డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ ఎస్సీ సెల్ చైర్మన్ పంగ శ్రీహరి, జనరల్ సెక్రటరీ కిష్టిగారి రవి, డివిజన్ సెక్రటరీ చల్ల మనోహర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం, ఎస్సీ సెల్ కార్యక్రమాల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యంపై చర్చించారు.

మోడల్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



మందమర్రి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

మందమర్రి పట్టణంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ నృత్యాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విద్యార్థుల్లో గౌరవం, ఐక్యతా భావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మోడల్ కళాశాల విద్యార్థిని



మందమర్రి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)

మందమర్రి తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని మిట్టపల్లి హర్షిత అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఖమ్మంలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొననుందని కళాశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ తెలిపారు. హర్షితను పీఈటీ ఎం. చిన్నక్క అభినందించగా, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలపై ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు వినతి

చౌటుప్పల్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)



విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి. బాల కిష్టారెడ్డికి మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్వీ అధ్యక్షుడు నలపరాజు రమేష్ శుక్రవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్, ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజుల వసూలు, ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతుల కొరత, అధ్యాపకుల నియామకం, పరీక్షల ఫలితాల్లో జాప్యం తదితర సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు రమేష్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక







తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెల్లాపూర్, అక్టోబర్ 9 తెలంగాణ వాణి):
తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రపురం మండల విద్యాధికారి తోట భాస్కర్ విద్యార్థులతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. విద్యార్థులు తరగతుల వారీగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను తెలియజేస్తూ నాటికలు, ఉపన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీ హరి శంకర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, భూపాల్ రెడ్డి, ఇందిరా దేవి, రజిత సాగర్, డి. అనురాధ, మహేశ్వర్, విమల దేవి, రత్నమాల, నర్సింలు, ఏ. అనురాధ, ప్రగతి, రత్న కుమార్, శంకర్, విద్యా వాలంటీర్లు భవాని, లత, సంధ్య, మాధురి, గౌతమి, మౌనిక, సాయి కిరణ్, సింధు తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు మార్గం సుగమం

ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి శాలివాహన సంఘం నాయకుల కృతజ్ఞతలు



వనపర్తి, అక్టోబర్ 9 తెలంగాణ వాణి):
వనపర్తి జిల్లా కేంద్రంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడంతో మార్గం సుగమమైంది. ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి చొరవతో ఈ నిర్ణయం కార్యరూపం దాల్చిందని శాలివాహన సంఘం నాయకులు తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధు గౌడ్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించడంతో శాలివాహన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బొడ్డుపల్లి పరశురాం ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు బొడ్డుపల్లి నరసింహ, వనపర్తి టౌన్ అధ్యక్షులు బొడ్డుపల్లి వెంకటేష్ వనపర్తి టౌన్ గౌరవ అధ్యక్షులు మన్నెంకొండ బొడ్డుపల్లి మణ్యం, బొడ్డుపల్లి వెంకటయ్య,బొడ్డుపల్లి లక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, యువనాయకులు యువకులు గుణగంటి లక్ష్మీనారాయణ గుణగంటి అంజి, సూర్యవంశం శివ, సతీష్, చిన్న, రమేష్, రాజు, గుణగంటి పవన్, నాగపూర్ అంజి, గుణగంటి లోకేష్, గుణగంటి యాదగిరి, యువకులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నేర సమీక్ష సమావేశంలో వనపర్తి ఎస్పీ డి. సునిత రెడ్డి ఆదేశాలు



వనపర్తి, అక్టోబర్ 9తెలంగాణ వాణి):
జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ డి. సునిత రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ప్రతి ఎఫ్ఐఆర్‌ను ఈ-సాక్ష్య విధానంలో నమోదు చేసి, ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించాలని సూచించారు. బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం 60, 90 రోజుల గడువులోపు దర్యాప్తు పూర్తి చేయాలని, జీరో ఎఫ్ఐఆర్‌లు, సైబర్ నేరాలు, ఈ-పెట్టీ కేసులపై తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. డయల్-112 ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు సకాలంలో సహాయం అందించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ చార్జ్‌షీట్ల దాఖలు, సమన్లు, వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం అందించే లక్ష్యంతో అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

2,000 మంది విద్యార్థులతో అవగాహన కార్యక్రమం



హసన్‌పర్తి, అక్టోబర్ 9తెలంగాణ వాణి):
సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు సూచించారు. హనుమకొండలోని స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, లఘు చిత్రాల ద్వారా సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులు తెరవవద్దని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తాము తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 16 ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన సుమారు 2,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డీసీపీ సెంట్రల్ జోన్ డి.కవిత, హనుమకొండ ఏసీపీ పి.నర్సింహారావు, సైబర్ క్రైమ్ ఏసీపీ ఎం.వెంకటరమణ, కేయూసీ సీఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ ఆరోపణ

వనపర్తి, అక్టోబర్ 9 తెలంగాణ వాణి):
ఎబ్బేరు పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో 40 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికావడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ ఆరోపించారు. శుక్రవారం ఆయన కళాశాలను పరిశీలించి, హాస్టల్ పరిస్థితులను ఆవేదనకరంగా అభివర్ణించారు. కళాశాల సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డులో చెత్తను తగలబెట్టడం వల్ల విద్యార్థులు పొగ, దుమ్ముతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 250 మందికి పైగా విద్యార్థులున్నా ఏఎన్ఎం, వాచ్‌మెన్ లేరని, రాత్రి వేళల్లో పర్యవేక్షణ కొరవడిందని ఆరోపించారు. వాటర్ ప్యూరిఫైయర్ మరమ్మతుకు గురికావడంతో తాగునీటి సమస్య నెలకొందన్నారు. డంపింగ్ యార్డును తరలించాలని, 24 గంటల వైద్య సేవలు, రాత్రి పర్యవేక్షకుడు, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని,



వాటర్ ప్యూరిఫైయర్‌ను వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అరవింద్, మహిళా అధ్యక్షురాలు కవిత యాదవ్, గోపీనాథ్, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలి

- **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. భూపాలపల్లిలో టాస్క్ మెగా జాబ్‌మేళా**
- **142కు పైగా కంపెనీలు.. 10--12 వేల ఉద్యోగావకాశాలు**
- **తొలి రెండు గంటల్లోనే 600 మందికి ప్రాథమిక ఎంపిక**

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 9తెలంగాణ వాణి):
యువత ఆధునిక రంగాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకొని ఉన్నత వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాబ్‌మేళాలో 142కు పైగా కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం టాస్క్, స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యమిస్తోందన్నారు. జాబ్‌మేళా ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికి పైగా అభ్యర్థులు ప్రాథమికంగా ఎంపిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, ఈ



జాబ్‌మేళా ద్వారా 10 వేల నుంచి 12 వేల వరకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయని తెలిపారు. అర్హత గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ప్రజాప్రతినిధులు ఎంపిక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంకీర్త్, టాస్క్ సీఈఓ ప్రదీప్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణతో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి

అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పామూరి

నిజామాబాద్, అక్టోబర్ 9 తెలంగాణ వాణి):
నిరంతర పర్యవేక్షణతో ప్రాథమిక ఆరోగ్య సేవలను మెరుగుపరిచి, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పామూరి సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆయన సమీక్షించారు. డెంగ్యూ, క్షయ, జీవనశైలి వ్యాధుల నివారణతో పాటు మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మారుమూల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రాధాన్యంగా సందర్శించి, మందుల నిల్వలు, ఆసుపత్రుల పరిశుభ్రత, సిబ్బంది సమయపాలనను తనిఖీ



చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని, ఆరోగ్య శిబిరాలు, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజశ్రీ, జిల్లా ఉప వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



మంచిర్యాల, అక్టోబర్ 09తెలంగాణ వాణి):
రీ-సర్వే గ్రామాల్లో భూముల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన అనంతరం తదుపరి సర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో సంబంధిత సర్వే అధికారులు, తాండూర్, నెన్నెల, భీమిని, వేమనపల్లి మండలాల తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, అధికారుల సమన్వయంతో సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అదనపు కలెక్టర్ వి. భుజంగరావు



నిజామాబాద్, అక్టోబర్ 9 తెలంగాణ వాణి):
: సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ, దరఖాస్తుదారులకు నిర్దిష్ట గడువులో సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ వి. భుజంగరావు అధికారులను ఆదేశించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని నిజామాబాద్ కలెక్టరేట్‌లో అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఆర్‌టీఐ అమలుపై నిర్వహించిన ప్రతిజ్ఞలో వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యమిస్తూ రికార్డులు, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. చట్టాన్ని సమర్థంగా అమలు చేసి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్ఓ గీత, కలెక్టరేట్ ఏఓ బాలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15న సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్



మంచిర్యాల, అక్టోబర్ 09 (తెలంగాణ వాణి):
సింగరేణి కార్మికులకు దసరా పండుగ అడ్వాన్స్‌ను అక్టోబర్ 15న చెల్లించేందుకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. పర్మినెంట్ కార్మికులకు రూ.25 వేలు, సెలవులకు అర్హతలేని తాత్కాలిక కార్మికులకు రూ.12,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.ఈ మొత్తాన్ని డిసెంబర్ 2026 నుంచి పది సమాన వాయిదాల్లో వేతనాల నుంచి తిరిగి వసూలు చేయనున్నారు. గతంలో తీసుకున్న అడ్వాన్స్ బకాయిలు ఉన్న ఉద్యోగులకు మిగిలిన మొత్తానికే అర్హత ఉంటుందని యాజమాన్యం స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం అర్హులైన కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ, దసరా పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించింది.

సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



మంచిర్యాల, అక్టోబర్ 09 (తెలంగాణ వాణి):
ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల జవాబుదారితనాన్ని పెంపొందించేలా సమాచార హక్కు చట్టం--2005ను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు--2026 సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.ప్రజలకు నిర్దిష్ట గడువులోగా సమాచారం అందించాలని, చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని గవర్నర్ సూచించారు. అనంతరం అధికారులు చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్లో ఘనంగా బతుకమ్మ ఆరంభ ఉత్సవాలు

హనుమకొండ, కాకతీయ యూనివర్సిటీ, తెలంగాణ వాణి 09-10-2016
కాకతీయ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో ఈ సంవత్సరపు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి రామచంద్రం ప్రారంభించగా భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి పద్మజ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్లు నూనావత్ రాధా, సదాలక్ష్మి మరియు చిట్యాల ఐలమ్మ కోడలు చిట్యాల శ్వేత గారు ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చి ఈ ఉత్సవాలకు మరింత రంగుల మయంగా మార్చారు. ప్రొఫెసర్ వి రామచంద్రం మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద ఆడబిడ్డల పండుగ అయినటువంటి ఈ బతుకమ్మ పండగ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా పేర్కొన్నారు. విభాగాధిపతి డా పద్మజ మాట్లాడుతూ ఈ సాంప్రదాయం వెనుక ఉన్నటు వంటి విజ్ఞానాన్ని వివరించారు. అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు ఆటపాటలతో సంబరాలు జరుపుకుంటూ బతుకమ్మ వేడుకలు చేసినారు.

ప్రముఖ రంగస్థల నటుడు పబ్బా శంకర్ గౌడ్ మృతి

ఏడు దశాబ్దాల కళా ప్రస్థానానికి ముగింపు

వనపర్తి, అక్టోబర్ 9 తెలంగాణ వాణి):



ప్రముఖ రంగస్థల నటుడు పబ్బా శంకర్ గౌడ్ (83) మృతి కళారంగానికి తీరని లోటని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఆత్మకూరు మండలం తిప్పదంపల్లి గ్రామానికి చెందిన పబ్బా శంకర్ గౌడ్ ఏడు దశాబ్దాలకు పైగా నాటకరంగానికి సేవలందించారని తెలిపారు. వందలాది నాటకాలు, ఏకపాత్రాభినయాలతో ప్రేక్షకుల ఆదరణ పొందిన ఆయన కురుక్షేత్రం, శ్రీకృష్ణ రాయ బారం, రామాంజనేయ యుద్ధం, చింతామణి వంటి నాటకాల్లో అద్భుతంగా నటించారని గుర్తుచేశారు. రంగస్థలంతో పాటు సినీరంగంలోనూ రాణించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు అందుకున్నారని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు, సాహితీవేత్తలు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి కోదాడ ప్రెస్‌క్లబ్ అండ

అనారోగ్యంతో పనులకు దూరమైన షేక్ మన్నాన్‌కు నిత్యావసర సరుకుల పంపిణీ



కోదాడ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి కోదాడ ప్రెస్‌క్లబ్ సభ్యులు అండగా నిలిచారు. పట్టణంలోని 15వ వార్డు నయానగర్‌కు చెందిన షేక్ మన్నాన్ కాళ్లకు గాయాలై, ఇన్ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురయ్యారు. దీంతో పనులకు వెళ్లలేక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్న ఆయనకు ప్రెస్‌క్లబ్ సభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కాసారపు కృష్ణ (చందు మొబైల్స్), ఎం.డీ. రహీమ్, షేక్ నూరుద్దీన్ దాతలుగా సహకరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గద్దం అంజి, గౌరవ సలహాదారు వీరాంజనేయులు, సభ్యులు బానాల అబ్రహాం, జగన్‌మోహన్‌రావు, ఉపేందర్, జి. మోహన్, ఏ. వెంకటేశ్వరులు, గోపీచంద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా రాజాగౌడ్ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ సిటీ, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)



నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా రాజాగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ఎస్. కిరణ్‌కుమార్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రభుత్వం రాజాగౌడ్‌ను నియమించింది. గతంలో ఆయన బాన్సువాడ, బోధన్, ఆర్మూర్‌లలో ఆర్డీఓగా, జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే : కలెక్టర్ ఇలా త్రిపాఠి

రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని ఆదేశం



నిజామాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
రైతులు, భూ యజమానులకు భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా రీసర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం సాలూర మండలం ఫతేపూర్‌లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ వి. భుజంగరావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, భూముల హద్దుల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రోజుకు సగటున 30 ఎకరాల చొప్పున సర్వే పూర్తి చేయాలని సూచించారు. సాలూర మండలంలో తొలి విడతగా మూడు గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని, బోధన్ రెవెన్యూ డివిజన్‌లో ఇప్పటికే సుమారు 3 వేల ఎకరాల్లో సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. రీసర్వేతో భూ సరిహద్దు సమస్యలు, వివాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీఓ విజయకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు అండగా నిలవాలి

సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని



నిజామాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
మానసిక దివ్యాంగులైన పిల్లలకు ప్రేమ, ప్రోత్సాహం, సరైన శిక్షణ అందిస్తే వారి అభివృద్ధికి తోడ్పడవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిజామాబాద్ మారుతీనగర్‌లోని స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, స్నేహ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా, ప్రత్యేక పాఠశాలలు, సేవా సంస్థల సహకారం పొందాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులకు సరైన ధ్రువపత్రాలు అందేలా సహకరిస్తానని తెలిపారు. మానసిక వైద్యశాఖాధిపతి డాక్టర్ విశాల్ మాట్లాడుతూ, పిల్లల్లో వైకల్యాలను చిన్న వయసులోనే గుర్తించి తగిన శిక్షణ అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు, స్నేహ సొసైటీ ప్రతినిధులు, అధికారులు, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సుదర్శన్ చారి మృతి సీపీఐకి తీరని లోటు



హుస్నాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ఆర్‌సీ)
పోట్లపల్లికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ మండల కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వలువోజు సుదర్శన్ చారి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన సుదర్శన్ చారి కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన కులవృత్తిని కొనసాగిస్తూనే కుమారులను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి మౌటం బాలయ్య, నాయకులు బొయిని ఎల్లయ్య, వలువోజు మల్లయ్య, కురుమెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

చేర్లపల్లిలో మౌలిక వసతులు కల్పించాలి

డ్రైనేజీలు, సీసీ రోడ్లు, బతుకమ్మ ఘాట్లు నిర్మించాలని వినతి



ఎండపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)
ఎండపల్లి మండలం చేర్లపల్లి గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, బతుకమ్మ ఘాట్లు నిర్మించాలని కోరుతూ గ్రామస్థులు, బీజేపీ నాయకులు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. గ్రామంలోని పలు వార్డుల్లో డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతోందన్నారు. ఎస్సీ కాలనీలోని చూంచులచ్చయ్య ఇంటి నుంచి జంగిలి నర్సయ్య ఇంటి వరకు, దాసరి రాజయ్య ఇంటి నుంచి మంద వరకు డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. నల్లబావి వద్ద, చేర్లపల్లి చెరువు సమీపంలో మహిళల కోసం బతుకమ్మ ఘాట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీబీ--జీ రామ్‌జీ నిధులతో దాసరి లక్ష్మి ఇంటి నుంచి జంగిలి పెంచాల ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని, చింతలకాడి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ వరకు అధ్వానంగా ఉన్న రహదారికి సీసీ రోడ్డు వేయాలని కోరారు. అధికారులు, పాలకవర్గం స్పందించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మాణం కోసం నిరవధిక సమ్మె ఉధృతం

- వంటావార్పుతో నిరసన..
- నిర్మాణం చేపట్టే వరకు విరమించేది లేదని స్పష్టం



శంకరపట్నం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో జాతీయ రహదారి 563పై అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లి, కొత్తగట్టు గ్రామస్తులు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతమైంది. గత మంగళవారం టోల్‌ప్లాజా వద్ద ప్రారంభమైన ఈ ఆందోళనలో భాగంగా గురువారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. గత బుధవారం రెండు గ్రామాల ప్రతినిధులు జిల్లా



కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. దీనిపై ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి, అండర్‌పాస్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రెండు గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యంగా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని, అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ పనులు చేపట్టే వరకు నిరవధిక సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు.

దేవి నవరాత్రులకు పటిష్ట పోలీసు బందోబస్తు

- డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలి

సీపీ సాయి చైతన్య



నిజామాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
రాబోయే దేవి నవరాత్రుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసుల పురోగతి, నేరాల నియంత్రణపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. హత్యలు, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు సహా పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెంచాలని, రాత్రి గస్తీని బలోపేతం చేయాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక పోలీసు బృందాలను అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. పేకాట, గుట్కా వంటి అక్రమ కార్యకలాపాలపై దాడులు కొనసాగించాలని, సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తరించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పండుగల సమయంలో వాహనాల తనిఖీలు, బందోబస్తులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు డీసీపీ ఎన్. శుభం ప్రకాష్, ఏసీపీ ప్రకాష్ యాదవ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులు మనలో ఒకరు

- ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం
- ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా న్యాయ చైతన్య సదస్సు



కాప్రా / జవహర్‌నగర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
మానసిక దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను సమాజంలో అందరితో సమానంగా గౌరవిస్తూ, వారు అన్ని రంగాల్లో ఎదిగేలా ప్రోత్సహించాలని సీనియర్ సివిల్ జడ్జి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.ఎస్.ఎల్. ప్రియాంక అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి.



బాలభాస్కర్ ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్‌నగర్‌లోని స్వయంకృషి స్వచ్ఛంద సంస్థలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల శిక్షణ కేంద్రాన్ని జడ్జి ప్రియాంక సందర్శించి, వారికి అందిస్తున్న విద్య, వసతులు, శిక్షణను పరిశీలించారు. విద్యార్థులు స్వయం శక్తితో ఎదిగేలా సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులు ఉచిత న్యాయ సేవలను ఎలా పొందవచ్చో వివరించారు. కార్యక్రమంలో స్వయంకృషి సంస్థ వ్యవస్థాపకులు మంజుల కళ్యాణ్, న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యుడు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ జీవన్ దంపతులకు ఘన సన్మానం



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దబ్బా గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ దేశెట్టి జీవన్, ఆయన భార్యను ఎల్ఐసీ అధికారులు ఘనంగా సత్కరించారు. ఎల్ఐసీలో 20 ఏళ్ల సేవలు పూర్తి చేసుకున్న సందర్భంగా డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ సన్మానం చేశారు. ఈ సందర్భంగా జీవన్ అందించిన సేవలను అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో మెట్పల్లి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రామశర్మ, రామకృష్ణ, సీనియర్ ఏజెంట్లు బోడి నారాయణ గౌడ్, కంఠం భరత్, సామల విష్ణు, గోకుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన్ ఓక్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన నిర్మల జగ్గారెడ్డి, కాట సుధా శ్రీనివాస్ గౌడ్



పటాన్‌చెరు, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
ఇస్నాపూర్‌లోని జ్ఞాన్ ఓక్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. సంప్రదాయ పాటలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

హుస్నాబాద్ బాలికల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



హుస్నాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ఆర్‌సీ):
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గంగిశెట్టి మహేందర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని, తెలంగాణ సంస్కృతి సంప్రదా యాలు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



జగిత్యాల/బుగ్గారం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ నక్క రాజు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రమశిక్షణ, సాంస్కృతిక, కళారంగాల్లోనూ విద్యార్థులు రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య జన్మదిన వేడుకలు



డిండి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
తవక్లాపూర్ గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య జన్మదిన వేడుకలను గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణయ్య 2005 నుంచి తన తండ్రి జ్ఞాపకార్థం పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.5,000, రూ.2,500 చొప్పున బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పుడు సొంత నిధులతో ఉపాధ్యాయుడిని నియమించి విద్యాభివృద్ధికి సహకరించారు. 2014 నుంచి గ్రామంలో ఎవరైనా మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తున్నారు. 2026 నుంచి ఆడబిడ్డల వివాహాలకు 'పొన్నగంటి కళ్యాణ కానుక'గా రూ.5,116 అందిస్తున్నారు. ప్రజాసేవలో కొనసాగుతున్న ఆయనకు గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి పంచాయతీలో రెండు ఫామ్ పాండ్లు నిర్మించాలి

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలి: డీఆర్‌డీఓ




నాగిరెడ్డిపేట, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
వదలపర్తి గ్రామపంచాయతీ పరిధిలో వీబీ--జీ రామ్ జీ పథకం కింద రైతు అబ్దుల్ నబీ పొలంలో నిర్మించిన ఫామ్ పాండ్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో కనీసం రెండు ఫామ్ పాండ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామ సంఘాల ద్వారా రైతులను గుర్తించి, మరిన్ని ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీఓ, ఇతర అధికారులు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి 8 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

రూ.22.84 కోట్లతో నిర్మాణాలు.. ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవ



ఎల్లారెడ్డి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రూ.22.84 కోట్ల వ్యయంతో ఎనిమిది నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ చేసిన కృషితో ఈ నిధులు మంజూరయ్యాయి. సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేట, కుప్రియాల్, తిమ్మోజివాడి, లింగంపేట మండలంలోని లింగంపల్లి, రామారెడ్డి మండలంలోని గిద్ద, నాగిరెడ్డిపేట మండలంలోని వాడల్‌పర్తి, గాంధారి మండలంలోని గుర్జాల్, ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లలో సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. వీటి ఏర్పాటుతో తక్కువ వోల్టేజీ సమస్యలు తగ్గి, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆశిస్తున్నారు.

తెలంగాణలో 95 లక్షల ఓట్ల తేడాపై సమాధానం చెప్పాలి

సీఈసీని ప్రశ్నించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణ రావు

కరీంనగర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)



తెలంగాణలో ఓటర్ల సంఖ్య 3.38 కోట్ల నుంచి 2.43 కోట్లకు తగ్గినట్లు పేర్కొంటున్న గణాంకాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, సుడా మాజీ చైర్మన్ జి.వి. రామకృష్ణ రావు డిమాండ్ చేశారు. దాదాపు 95 లక్షల ఓట్ల తేడాకు కారణాలేమిటో జిల్లాలు, నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు వెల్లడించాలని కోరారు. ఓటర్ల పేర్ల తొలగింపునకు ముందు నోటీసులు ఇచ్చారా? అర్హులకు అభ్యంతరాలు తెలిపే అవకాశం కల్పించారా? తొలగించిన పేర్లను తిరిగి నమోదు చేసేందుకు తీసుకుంటున్న చర్యలేమిటో స్పష్టం చేయాలన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా, ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని ఆయన కోరారు.

అపోలో కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ వేడుకలు



హుస్నాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ఆర్సి):
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వేముల గణేష్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి, ప్రభుత్వ గైనకాలజిస్ట్ డాక్టర్ రమాదేవి, ఎస్టీ బాలుర హాస్టల్ వార్డెన్ విజయ్ కుమార్, బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ నాయక్ హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ వేముల అంజయ్య, అంబేద్కర్ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, స్నేహభావం, పరస్పర సహకారాన్ని అలవర్చుకోవాలని నిర్వాహకులు సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

బుగ్గారంలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



జగిత్యాల/బుగ్గారం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, మండల విద్యాధికారి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ వేడుకలు వైభవంగా జరిగాయి. విద్యార్థినులు, ఉపాధ్యాయులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రవి ప్రసాద్, మనోహర్, అశోక్, శ్రీనివాస్, విజయలక్ష్మి, కృష్ణకుమారి, అతియా కౌసర్, అరుణ్‌కుమార్, సీఆర్‌పీ పురుషోత్తం, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో కాన్షీరామ్‌కు ఘన నివాళి

జహీరాబాద్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి



): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతిని పురస్కరించుకుని భీమ్ ఆర్మీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అలీమ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర భీమ్ ఆర్మీ అధ్యక్షుడు సిద్దు రావణ్ మాట్లాడుతూ, కాన్షీరామ్ బహుజన చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్, ధనరాజ్, బాల్‌రాజ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండగ సందడి నడుమ.. పడకేసిన పారిశుధ్యం!

- వెల్గటూర్ మండల కేంద్రంలో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్వాసనతో వ్యాపారులు, వినియోగదారుల ఇబ్బందులు
- పంచాయతీ పాలకవర్గం తీరుపై ప్రజల ఆగ్రహం.. తక్షణ చర్యలకు డిమాండ్

వెల్గటూర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)
పండగ వచ్చిందంటే వీధులన్నీ శుభ్రంగా ఉండాలి.. వ్యాపార సముదాయాలు పరిశుభ్రతతో కళకళలాడాలి. ప్రజలు సంతోషంగా కొనుగోళ్లు చేసుకోవాలి. కానీ జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. పండగ సందడి పెరుగుతున్న వేళ పారిశుధ్యం పడకేయడంతో ప్రధాన వీధులు, దుకాణాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుండగా.. దుర్వాసనతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దుకాణాల ముందు చెత్త కుప్పలు
మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, దుకాణాల వద్ద చెత్త పేరుకుపోవడంతో పండగ కొనుగోళ్లకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో ఈగలు, దోమలు పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండగ వేళ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన సమయంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పంచాయతీ నిర్వహణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.





పన్నులు చెల్లిస్తున్నా.. సౌకర్యాలు ఏవీ?
గ్రామ పంచాయతీకి వివిధ రూపాల్లో పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కనీస పారిశుధ్య సౌకర్యాలు అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. దుకాణాల ముందు చెత్త పేరుకుపోవడంతో వ్యాపారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. మండల కేంద్రంలోనే పారిశుధ్య పరిస్థితి ఇలా ఉంటే.. మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పాలకవర్గం పర్యవేక్షణ ఏదీ?
పారిశుధ్య నిర్వహణపై సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం తగిన దృష్టి సారించడం లేదని స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీధులను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, వ్యర్థాల నిర్వహణపై పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. పండగ సమయంలో ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లోనైనా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలకముందే మేల్కొనాలి
చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి మరింత దిగజారకముందే పంచాయతీ యంత్రాంగం స్పందించి పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోనూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి చెత్త కుప్పలను తొలగించి, పారిశుధ్య నిర్వహణను గాడిలో పెట్టాలని వెల్గటూర్ ప్రజలు కోరుతున్నారు.

యూనివర్సల్ హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

పెద్దపల్లి, అక్టోబర్, 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)
పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం గన్ శ్యాం దాస్ నగర్ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ నీబ్ (ఐ.ఐ.టి. ఫౌండేషన్) హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణమంతా కోలాహలంగా మారింది.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను పాఠశాలకు తీసుకువచ్చారు. బాలికల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ఆవరణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థినులు చప్పట్లు కొడుతూ, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు తీసుకొచ్చిన బతుకమ్మలలో అత్యంత చక్కగా, ఆకర్షణీయంగా అలంకరించిన బతుకమ్మలకు పాఠశాల యాజమాన్యం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను అందజేసింది.



ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అష్టల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు మరియు బతుకమ్మ పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఇలాంటి వేడుకలు విద్యార్థులలో సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికల కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.

హుస్నాబాద్ అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ఆర్ సి)
హుస్నాబాద్ లోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ చైర్మన్ వి.లలిత మాట్లాడుతూ పువ్వులను దేవతలుగా భావించి పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ అని తెలుపుతూ ఆడపడుచులందరూ బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, మహిళల జీవన విధానానికి ప్రతికగా నిలిచే అద్భుతమైన పూల పండుగ అని పేర్కొన్నారు. అనంతరం ఎన్ఎస్–ఎస్ ప్రోగ్రాం అధికారి డి.కర్ణాకర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అనేది తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దం అని, ఆడపడుచులు ఎంతో ఇష్టంగా జరుపుకునే విశిష్టమైన పూల పండుగ అని అన్నారు.అనంతరము మహిళా అధ్యాపక బృందము అధ్యాపకేతర బృందము ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థినిలు ఆటపాటలతో ఆడి పాడారు. మహిళా అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థుల యొక్క



ఆటపాటలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.కర్ణాకర్ యొక్క పర్యవేక్షణలో జరిగినది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందము డి రవీందర్, ఎస్ సదానందం, టి నిర్మలాదేవి, బి .లక్ష్మయ్య ,ఏ సంపత్, ఎస్ కవిత, కే స్వరూప ,జీ కవిత, ఆస్మా ఫిర్దూస్, ఓ రాణి , జూనియర్ అసిస్టెంట్లు కె .గీతాంజలి ,ఎస్ రాములు, రికార్డ్ అసిస్టెంట్ టి రమాదేవి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని లు మొదలగువారు పాల్గొన్నారు.



జెడ్పీహెచ్ఎస్ నారాయణఖేడ్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ: మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్ షెట్కార్

నారాయణఖేడ్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ఆటపాటలతో పాటు తెలంగాణ మహిళల చారిత్రక పోరాటాలకు ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ పండుగలు, సంప్రదాయాలను పరిచయం చేసేందుకు పాఠశాలల్లో ఇలాంటి వేడుకలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి, షెట్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివాని షెట్కార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు బసమ్మ, సునంద, అశోక్‌గౌడ్, రాజశేఖర్, చంద్రశేఖర్, రాజయ్య, ధన్‌సింగ్, లక్ష్మణరావు పాల్గొన్నారు.



పూల పండుగ.. పర్యావరణ సందేశం!

బాలికల గురుకులంలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

తిమ్మాపూర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఎం.జె.పి.టి.బి.సి. డబ్ల్యూ.ఆర్.జె.సి. బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సరిత ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ పాటలు, కోలాటాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత మాట్లాడుతూ బతుకమ్మలో ఉపయోగించే పూల ఔషధ గుణాలు, జానపద వైద్యంలో వాటి ప్రాధాన్యతను వివరించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ విశిష్టత, వివిధ రోజుల పేర్లు, వాటి ప్రత్యేకతలను విద్యార్థినులకు తెలియజేశారు. సహజసిద్ధమైన పూలతో బతుకమ్మలను తయారు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనిత, నాగమణి, సుజాత, ఉమారాణి, శాలిని, రేఖతో పాటు పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మేజర్ వాడి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



నాగిరెడ్డిపేట, అక్టోబర్ 9: (తెలంగాణ వాణి ప్రతినిధి)
నాగిరెడ్డిపేట మండలం మేజర్ వాడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు శ్రీలత, మౌనిక, శ్రీనివాస్, సరోజ, రేణుక, ఎస్ఎంసీ చైర్మన్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కళాకారుల వేదిక నుంచి తొలగింపు



కరీంనగర్ అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
తెలంగాణ కళాకారుల వేదిక కమిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ కోశాధికారి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సంపత్‌ను సంఘం నుంచి తొలగించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బోళ్ల కొంరెల్లి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండేళ్లుగా కోశాధికారిగా పనిచేసిన సంపత్ సంఘానికి సరైన లెక్కలు అప్పగించనందున క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

గొర్రెలు, మేకలు పొలంలో మేస్తున్నాయని మందలించినందుకు గొడ్డలితో దాడి

రైతు ఎడమ చేతికి తీవ్ర గాయం.. కేసు నమోదు చేసిన పోలీసులు

వీణవంక, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):



పొలంలో గొర్రెలు, మేకలు మేస్తున్నాయని మందలించినందుకు ఓ రైతుపై గొడ్డలితో దాడి చేసిన ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఘనముక్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో రైతు కులపాక వెంకటేష్ ఎడమ చేతికి తీవ్ర గాయమైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 8న సాయంత్రం వెంకటేష్ తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా, గ్రామానికి చెందిన ఆశీరోజ్యంకు చెందిన గొర్రెలు, మేకలు పొలంలో మేస్తున్నాయి. దీంతో వెంకటేష్ మందలించగా ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఆశీరోజ్యం గొడ్డలితో వెంకటేష్‌పై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వీణవంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి ఆహ్వానం



జగిత్యాల/బుగ్గారం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని ఎడ్ల నాగలి చౌరస్తా వద్ద నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని ఉత్సవాల నిర్వాహకులు మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల వివరాలను ఆయనకు తెలియజేసి, అమ్మవారి శరన్నవరాత్రి వేడుకల్లో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు, భక్తులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మూల సుమలత శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మా బడి బతుకమ్మ



శంకరపట్నం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)
శంకరపట్నం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ‘మా బడి బతుకమ్మ’ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

జమ్మికుంట గురుకుల పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



జమ్మికుంట, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జమ్మికుంటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను వివరిస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని నిర్వాహకులు వివరించారు. విద్యతోపాటు సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థినులకు సూచించారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో మన సంస్కృతిపై గౌరవం, ఐక్యత, పరస్పర సహకార భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జె. రాంసింగ్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ డి. ప్రవీణ్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ జి. శ్రీకాంత్‌తో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ.. పట్టుకున్న అధికారులు

18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం.. ముగ్గురిపై కేసు



ధర్మారం, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి)
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం మిల్లులో తనిఖీలు నిర్వహించి, 18 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని కూడా పరిశీలించారు. ధర్మారం ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్, పోలీసు సిబ్బందితో పాటు డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రాజిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ వ్యవహారంలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన మరో వ్యక్తి, మిల్లు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పూలనే దేవుళ్లుగా భావించే గొప్ప సంస్కృతి మనది

కాకతీయ హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



చిట్యాల, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిలో సహజంగా లభించే రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, పూలనే దేవుళ్లుగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణదని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. పండుగ సెలవుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు ఎక్కువ సమయం కేటాయించకుండా, హోంవర్క్ పూర్తి చేస్తూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. అపరిచితులతో వెళ్లకుండా తల్లిదండ్రుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ ఆఫీజ్ , ఫర్హిన్ హాజ్మీ , టీచర్స్,అనుష , రవళి, విజేత, రమ, శ్యామల, నవనీత, విజేందర్, సంపత్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిలో సహజంగా లభించే రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, పూలనే దేవుళ్లుగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణదని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. పండుగ సెలవుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు ఎక్కువ సమయం కేటాయించకుండా, హోంవర్క్ పూర్తి చేస్తూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. అపరిచితులతో వెళ్లకుండా తల్లిదండ్రుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్స్ ఆఫీజ్ , ఫర్హిన్ హాజ్మీ , టీచర్స్,అనుష , రవళి, విజేత, రమ, శ్యామల, నవనీత, విజేందర్, సంపత్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్, ప్రియాంక అరెస్టులకు నిరసనగా యూత్ కాంగ్రెస్ ధర్నా

- జమ్మికుంట బస్టాండ్ వద్ద రాస్తారోకో..
  కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు
- ఓటు హక్కుల పరిరక్షణ కోసం
  పోరాటం ఆగదు: సజ్జద్ మహమ్మద్





జమ్మికుంట, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలపై దాడి, అరెస్టులను ఖండిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు జమ్మికుంట బస్టాండ్ వద్ద మహా ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జద్ మహమ్మద్, జమ్మికుంట ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సజ్జద్ మహమ్మద్, మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్ చందా రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడటం, ఓటు హక్కును పరిరక్షించడం లక్ష్యంగా తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్, దౌలత్, ప్రధాన కార్యదర్శులు శనిగరపు తరుణ్, పంజాల అజయ్, పాతకాల రమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి పర్వేజ్, బాబర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూడిగే శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్, వేవునూరి వినయ్, అకినపల్లి శ్యామ్ కళ్యాణ్, సేవాదళ్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, వొళ్లాల రవి, టెంకురాల కిషోర్, మరపల్లి అజయ్, రాజేష్, ఇమ్రాన్, రాచపల్లి రాజశేఖర్, శనిగరపు రాజు, శివ, కోలుగురి రవి, సమీర్, సందీప్, ఎన్ఎస్‌యూఐ నాయకులు రాజు, అభిషేక్, రాజవంశన్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు ప్రేమాభిమానాలు పంచాలి

- వైకల్యం శరీరానికే.. విజయ సాధనకు కాదు
- భవిత కేంద్రంలో మండల న్యాయ సేవా కమిటీ
  ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నర్సాపూర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
మానసిక వైకల్యం కలిగిన చిన్నారులు, వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలు చూపిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వైద్యులు డాక్టర్ రఘువరన్, డాక్టర్ ప్రియాంక, న్యాయవాది ఏ. ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. వైకల్యం ఉన్నవారిని చిన్నచూపు చూడకుండా సమాజంలోని ఇతరులతో సమానంగా గౌరవించాలని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రోత్సహించాలని సూచించారు. వైకల్యం విజయ సాధనకు అడ్డంకి కాదని, సరైన ప్రోత్సాహం, సహకారం లభిస్తే వారు కూడా ఉన్నత విజయాలు సాధించగలరని పేర్కొన్నారు .తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, నర్సాపూర్ మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్, న్యాయమూర్తి ఎం. హేమలత సూచనలతో నర్సాపూర్‌లోని భవిత కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైద్యులు డాక్టర్ రఘువరన్, డాక్టర్ ప్రియాంక, రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రతినిధులు, నర్సాపూర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏ. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. మానసిక వైకల్యం కలిగిన చిన్నారులు, వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాలని కోరారు. వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని, హేళన చేయడం, కించపరచడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. దివ్యాంగుల హక్కులను ఉల్లంఘిస్తూ వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ
వైద్య శిబిరంలో భవిత కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు, అతిథుల చేతుల మీదుగా చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఏ. శ్రీనివాస్, పి. సుధాకర్, మధు శ్రీ శర్మ, కె. నాగరాజు, ఏ. సాయిరాం, భవిత కేంద్ర నిర్వాహకులు పద్మావతి, సువార్త, న్యాయ సేవా సంస్థ సిబ్బంది సుభాష్, అరుణ, శ్రీనివాస్, భవిత కేంద్రం చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డిండి దర్గాలో ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రత్యేక ప్రార్థనలు

- నియోజకవర్గ ప్రజలు
  సుఖసంతోషాలతో ఉండాలి
- రైతులకు సమృద్ధిగా
  పంటలు పండాలని ఆకాంక్ష



గుండ్లపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):
దేవరకొండ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని ఎమ్మెల్యే బాలు నాయక్ ఆకాంక్షించారు. డిండి మండల కేంద్రంలో ముస్లిం మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (గౌస్-ఏ-ఆజమ్) గంధోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని, ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ప్రేమ, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. దర్గాలు భక్తి, విశ్వాసంతో పాటు మానవత్వం, శాంతి సందేశాన్ని అందించే పవిత్ర స్థలాలని అన్నారు. రైతులు, కూలీలు, వ్యాపారులు, యువత, మహిళలు సహా నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఉర్సు, దర్గా వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుంటూ, అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దొంతినేని వెంకటేశ్వరరావు, దొండేటి మల్లారెడ్డి, గడ్డమీద సాయికుమార్, ఎండీ సాదిక్, కొప్పుల సురేందర్ రెడ్డి, డిండి పట్టణ కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మైనారిటీ సోదరులు, కాంగ్రెస్ కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు..

పెద్దపల్లి , అక్టోబర్ 9(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)
స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్) విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. 10 ఏళ్ల బాలుర విభాగంలో జె శ్రేయస్ గౌడ్ 60 మీటర్ల పరుగు పందెం, బి. మహంత్ కృష్ణ లాంగ్ జంప్‌లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి ఈ నెల 11న ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ సత్యనారాయణను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సతీష్, జ్యోతి పాల్గొన్నారు.

రైలు నుంచి పడి తీవ్ర గాయాలు.. బాధితుడిని కాపాడిన 108 సిబ్బంది

సకాలంలో స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



పెద్దపల్లి, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) ᵎ
ఎద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి కిందపడి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం స్ట్రెచర్‌పై అంబులెన్స్‌లోకి తరలించి, మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అత్యవసర సమయంలో సకాలంలో స్పందించి బాధితుడికి వైద్య సహాయం అందించిన 108 సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సహాయక చర్యల్లో 108 ఈఎంటీ కుమారస్వామి, పైలట్ పనగంటి శ్రీనివాస్, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.



వికలాంగుడికి 50 బస్తాల సిమెంట్ అందజేత

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బీర్ల ఫౌండేషన్ సాయం

రాజపేట, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి):
ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇచ్చిన మాట ప్రకారం వికలాంగుడైన ఇప్పల రమేష్‌కు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు బీర్ల ఫౌండేషన్ తరఫున 50 బస్తాల సిమెంట్‌ను ఉచితంగా అందజేశారు. రాజపేట మండలం బూరుపల్లి గ్రామానికి చెందిన రమేష్‌కు సిమెంట్ అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు నమిలె మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం రాజపేట మండల కేంద్రంలో సిమెంట్ బస్తాలను రమేష్‌కు అందించారు. ఈ సందర్భంగా రమేష్ ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నా రెడ్డి యాకూబ్ రెడ్డి, జూకంటి వెంకటేష్, మాడిశెట్టి శ్రీను, సుంకరి గోపాల్, సుంకరి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నిరసనను విజయవంతం చేయండి

నేడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కరీంనగర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):



ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల సాధన కోసం నేడు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్‌మోహన్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహించే ఈ ఆందోళనలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని, ఓటర్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తోందని ఆరోపిస్తున్న 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక

కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, అక్టోబర్ 8 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)
పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రధాన కూడళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్షలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు అవసరమైన చోట వన్‌వే, టూ-వే విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి, వారం రోజులపాటు ఫలితాలను పరిశీలించాలని సూచించారు. రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, పోలీసు, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలకు గౌరవం.. దసరా కానుకగా దుస్తుల పంపిణీ



నర్సాపూర్, అక్టోబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)
దసరా పండుగను పురస్కరించుకుని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ దుస్తులను పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులను పండుగ సందర్భంగా ప్రోత్సహిస్తూ దుస్తులు అందించడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్మికుల సేవలు ఎంతో కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించే కార్మికుల కృషిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. పండుగ వేళ కార్మికులకు అండగా నిలవడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇందిరా ప్రభాకర్, వార్డు సభ్యులు మహేష్ గౌడ్, యాదగిరి గౌడ్, శేఖర్, గ్రామ పెద్దలు శాఖా గౌడ్, గ్రామ కార్యదర్శి వెంకటేష్, రామకృష్ణ, విష్ణు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నితిన్ 'అలియాస్ రుక్మిణి' రిలీజ్ డేట్‌పై బిగ్ అప్‌డేట్..



టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో సినిమాలు తెరకెక్కిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న హీరో నితిన్ ప్రస్తుతం 'అలియాస్ రుక్మిణి' అనే చిత్రంలో నటిస్తున్నారు. 'దండోరా' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను హీరో నాని నిర్మిస్తుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి చిత్రబృందం కీలక ప్రకటనకు సిద్ధమైంది. 'అలియాస్ రుక్మిణి' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను రేపు ఉదయం 10:08 గంటలకు వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనకు సంబంధించిన ప్రత్యేక వీడియో ఇప్పటికే సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రకటనలో సినిమా విడుదల తేదీని వెల్లడించనున్నట్లు సమాచారం.

నితిన్ నటిస్తున్న ఈ చిత్రం రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోంది. విడుదల తేదీ ప్రకటనతో సినిమా ప్రమోషన్లకు మరింత ఊపొచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకు కథకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించకపోవడంతో ఈ సినిమా ఎలాంటి ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు రానుందనే ఆసక్తి నెలకొంది. నాని ప్రస్తుతం హీరోగా 'ది ప్యారడైజ్' చిత్రంతో బిజీగా ఉన్నారు. మరోవైపు నిర్మాతగానూ సినిమాలను నిర్మిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా నితిన్ హీరోగా నటిస్తున్న 'అలియాస్ రుక్మిణి' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ సినిమా రూపొందుతోంది. 'దండోరా' సినిమాతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడి గత చిత్రం తర్వాత వస్తున్న ఈ ప్రాజెక్టుపై సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. నితిన్‌ను ఈసారి ఎలాంటి పాత్రలో చూపించబోతున్నారనే విషయం తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

ఈ సినిమాలో నితిన్ సరసన ఎవరు కథానాయికగా నటించనున్నారనే విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. హీరోయిన్ వివరాలు బయటకు రాకపోవడంతో ఆ పాత్రలో ఎవరు కనిపించబోతున్నారనే ఆసక్తి కొనసాగుతోంది. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ వేగంగా జరుగుతున్నట్లు సమాచారం.ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. ప్రేమకథలకు అనుగుణంగా ఆయన అందించే సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ప్రేక్షకులు ఆశిస్తున్నారు. మొత్తానికి, నితిన్--నాని కలయికలో వస్తున్న 'అలియాస్ రుక్మిణి' సినిమాపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.

డేటింగ్ యాప్స్‌తో ప్రేమ చిక్కుల్లో పడింది

నటి ఐశ్వర్య లక్ష్మి



ప్రస్తుత ఆధునిక కాలంలో డేటింగ్ యాప్స్, సోషల్ మీడియా అందుబాటులోకి రావడంతో ప్రేమను వెతకడం చాలా సులభం అయిందని చాలామంది అనుకుంటారు. కానీ ఈ ఎక్కువ ఆప్షన్లే నేడు ప్రేమను మరింత కష్టతరం చేశాయని చెబుతుంది ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ వేదికగా వచ్చిన లవ్ అనే వెబ్ సిరీస్‌లో నటించిన ఆమె ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆధునిక సంబంధాలు, డేటింగ్ యాప్స్ మరియు మారుతున్న రిలేషన్ అర్థాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.

పాతకాలంతో పోలిస్తే ప్రస్తుతం సరైన భాగస్వామి కోసం అన్వేషణ చాలా గందరగోళంగా మారిందని ఐశ్వర్య తెలిపారు. అప్పట్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా ఒక క్లారిటీ ఉండేదని. కానీ ఇప్పుడు బోలెడన్ని ఆప్షన్లు ఉండటంతో అసలు ఏ దారిలో వెళ్లాలో తెలియక జనం అయోమయంలో పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా, నేటి తరం రిలేషన్‌షిప్‌లలో వస్తున్న సరికొత్త భాష చూసి తాను ఆశ్చర్యపోతుంటానని చమత్కరించారు. సిట్యుయేషన్‌షిప్, నానోషిప్ వంటి వింత పదాలే కాకుండా, తాజాగా 'బింజింగ్' అనే పదం గురించి నిన్ననే విన్నానని, నెట్‌ఫ్లిక్స్‌లో మాత్రమే వినే ఈ పదం ఇప్పుడు ప్రేమ సంబంధాలకు కూడా వర్తిస్తోందని తెలిసి నవ్వుకున్నట్లు చెప్పారు.

ఇక సమయం గడిచే కొద్దీ ప్రేమపై తనకున్న అవగాహన పూర్తిగా మారిపోయినట్లు ఐశ్వర్య వెల్లడించారు. తెరపై తీవ్రమైన, విషాదాంత ప్రేమ కథల్లో నటించడానికి ఇష్టపడే తను, నిజ జీవితంలో మాత్రం ప్రశాంతమైన, సులభమైన ప్రేమనే కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. జీవిత భాగస్వామి ఎంపికలో స్నేహానికి అత్యంత ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. 'ప్యార్ దోస్తీ హై' అనే భావన ఎంత నిజమో తన చుట్టూ ఉన్న విజయవంతమైన వివాహిత జంటలను చూశాక అర్థమైందని, భార్యాభర్తలుగా మారడానికి ముందు వారు మంచి స్నేహితులుగా ఉండటం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

గ్లామర్‌కే పరిమితం కావాలనుకోవడం లేదు..

ఇకపై అలాంటి పాత్రలే చేస్తా: దిశా పటాని



బాలీవుడ్‌లో తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ దిశా పటాని ఇప్పుడు తన కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ.. ఇకపై వైవిధ్యమైన, బలమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, ఇప్పటివరకు నేర్చుకున్న విషయాలు, భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటోందనే అంశాలపై దిశా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

దిశా పటాని తొలిసారిగా 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైంది. భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమా విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంది. ఈ పదేళ్లలో నటిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని దిశా తెలిపింది. విభిన్నమైన అనుభవాలు తనను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయని చెప్పింది. ఇప్పటివరకు తాను ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యమున్న సినిమాల్లో నటించినప్పటికీ, ఇకపై తన కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించింది.

సినిమా పరిశ్రమలో గ్లామర్‌తో గుర్తింపు తెచ్చుకోవడం ఒక ఎత్తయితే, నటిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించడం మరో ఎత్తు. ఈ విషయాన్ని దిశా పటాని కూడా గుర్తించినట్లు ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఇకపై ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, తనలోని నటనా ప్రతిభను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. కేవలం తెరపై అందంగా కనిపించడమే కాకుండా, కథలో కీలక పాత్ర పోషించే క్యారెక్టర్లు చేయాలని ఉందని దిశా తెలిపింది. ప్రేక్షకులు తన పాత్రతో భావోద్వేగపరంగా అనుసంధానమయ్యేలా ఉండాలని, కథను ముందుకు తీసుకెళ్లడంలో ఆ పాత్రకు ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం దిశా పటాని 'హోలీగార్డ్స్ సాగా: ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. భారతీయ సినిమాలతో పాటు అంతర్జాతీయ ప్రాజెక్టుల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఆమెకు ఈ చిత్రం కెరీర్‌లో మరో కీలక అడుగు కానుంది.

విడుదలకు ముందే 'రామాయణ' నిర్మాతకు ఐటీ షాక్..

ముంబయి కార్యాలయాల్లో తనిఖీలు!



బాలీవుడ్ 'రామాయణ' నిర్మాతల్లో ఒకరైన నమిత్ మల్హోత్రాకు చెందిన కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ముంబయిలోని ఆయన సంస్థ 'ప్రైమ్ ఫోకస్ లిమిటెడ్' కార్యాలయాలతో పాటు, ఆర్థిక సలహాదారులు మరియు సీఏ ఆఫీసుల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. విదేశీ లావాదేవీలు, నిధుల బదిలీకి సంబంధించిన పత్రాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఐటీ సోదాల వార్తల కారణంగా స్టాక్ మార్కెట్‌లో 'ప్రైమ్ ఫోకస్' షేరు విలువ సుమారు 8 శాతం వరకు పడిపోయింది. అయితే, ఈ తనిఖీలపై ఐటీ శాఖ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సుమారు రూ.4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా విడుదల కానున్న తరుణంలో ఈ ఐటీ రైడ్స్ సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మళ్లీ తెరపైకి 'కొత్త బంగారు లోకం' జోడీ..

ఆసక్తికరంగా 'నా వైఫ్ మిస్సింగ్' టీజర్!




ప్రముఖ నటులు వరుణ్ సందేశ్, శ్వేతా బస్సూ ప్రసాద్ జంటగా నటించిన సరికొత్త క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'నా వైఫ్‌మిస్సింగ్'. దాదాపు 18 ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ కలిసి నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ ఓటీటీ వేదిక 'ఆహా' ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ టీజర్‌ను విడుదల చేయగా ఈ టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

అమలాపురం బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం ఓ డిఫరెంట్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది. పెళ్లయిన కొద్ది రోజులకే భార్య అకస్మాత్తుగా అదృశ్యం కావడం, ఆ తర్వాత భర్త పోలీసులను ఆశ్రయించడం, భార్య గతం తాలూకు కొన్ని దిగ్భ్రాంతికరమైన విషయాలు తెలిశాక భర్తలోనే ఆమెపై అనుమానాలు మొదలుకావడం వంటి ఆసక్తికరమైన మలుపులతో ఈ టీజర్ సాగుతుంది. స్వాతి ప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను కొమర మీడియా వర్క్స్ బ్యానర్‌పై శివ కాంతనేని, ఆర్. వెంకటేశ్వర రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ సందేశ్, శ్వేతా బస్సూ ప్రసాద్‌తో పాటు ప్రవీణ్, మోహిత్, జబర్దస్త్ సత్య శ్రీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా అక్టోబర్ 22 నుండి 'ఆహా' ఓటీటీలో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది.

స్పిరిట్‌లో ప్రభాస్ డబుల్ లుక్..

సెకండాఫ్‌లో ఊహించని అవతారం?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటిస్తున్న అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టుల్లో 'స్పిరిట్' ఒకటి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో తనదైన మేకింగ్ శైలిని చూపించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే 'స్పిరిట్' గురించి వస్తున్న వార్తలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో ప్రభాస్ పాత్రకు సంబంధించి ఓ ఆసక్తికరమైన సమాచారం ప్రచారంలోకి వచ్చింది. ఈ సినిమాలో ప్రభాస్ గతంలో ఎన్నడూ కనిపించని విధంగా రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం.. 'స్పిరిట్'లో ప్రభాస్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రకు తగ్గట్టుగా ఒక ప్రత్యేకమైన లుక్‌లో ఆయన కనిపిస్తారని తెలుస్తోంది. అయితే సినిమా ద్వితీయార్ధంలో ప్రభాస్ మరో భిన్నమైన అవతారంలో కనిపిస్తారనే ప్రచారం ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ రెండు లుక్స్ మధ్య వ్యత్యాసం ఎలా ఉండబోతోంది? కథలో వచ్చే మలుపులకు ప్రభాస్ పాత్ర ఎలా అనుసంధానమై ఉంటుంది? అనే విషయాలపై అభిమానులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'స్పిరిట్'లో మాఫియా నేపథ్యానికి కూడా ప్రాధాన్యత ఉండనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్ పాత్రలో వచ్చే మార్పులు కథను ఏ మలుపు తిప్పుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com